జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 5-08-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 745 పేజీలు: 4 వెల : రూ.7

# 6 గంటలు.. సీదిరి విచారణ

✻ దానయ్య మృతి కేసులో ప్రశ్నల వర్షం ✻ మళ్లీ అంపోలు జైలుకు అప్పలరాజు ✻ ఒక్క రోజు పోలీసు కస్టడీ ముగింపు ✻ పలాసలో భారీ బందోబస్తు





పలాస, ఆగస్టు 4 (వార్త): దానయ్య మృతి కేసులో ఏ-3 నిందితుడిగా ఉన్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఒక్క రోజు పోలీసు కస్టడీ మంగళవారం ముగిసింది. కోర్టు అనుమతితో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో సోంపేట సీఐ మంగరాజు సుమారు ఆరు గంటలపాటు విచారించారు. కేసుకు సంబంధించిన ఆరోపణలు, సాక్ష్యాల తారుమారు, నిందితులను తప్పించేందుకు జరిగినట్లు ఉన్న ఆరోపణలపై ప్రశ్నించినట్లు సమాచారం. విచారణ అనంతరం పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు తిరిగి అంపోలు జిల్లా జైలుకు తరలించారు. మాజీ మంత్రి విచారణ నేపథ్యంలో కాశీబుగ్గ పోలీస్ స్టేషన్, అంపోలు జిల్లా జైలు వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అప్పలరాజు రాకతో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పలాసలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అదనపు బలగాలను మోహరించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పహారా నిర్వహించారు. గత నెల జరిగిన రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి దానయ్య మృతి చెందిన కేసులో అప్పలరాజు రిమాండ్‌లో ఉండగా, ఇదే కేసులో నిందితులైన ఆయన కుమారుడు ఆరవ్ వర్మ, మరో నిందితుడు సిద్ధార్థ ఇప్పటికే బెయిల్‌పై విడుదలయ్యారు. అప్పలరాజు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ ప్రస్తుతం కోర్టు పరిశీలనలో ఉందని వైసీపీ శ్రేణులు తెలిపాయి. కాగా, కస్టడీ విచారణ సందర్భంగా కోర్టుకు వెళ్తున్న న్యాయవాదులను అలాగే మీడియా ప్రతినిధులను కూడా పోలీసులు అడ్డుకోవడంతో వారితో వాగ్వాదానికి దిగారు. దీంతో వెనక్కి తగ్గిన పోలీసులు న్యాయవాదులను కోర్టుకు వెళ్లేందుకు అనుమతి ఇచ్చారు. అయితే మీడియా ప్రతినిధులను మాత్రం అన్ని చోట్లా అడ్డుకున్నారు.



✻ ప్రజలను ఉత్తేజపరిచేలా.. వంగపండు గీతాలు
✻ ప్రజా సమస్యలపై ప్రజాసంఘాలు, కళాకారులు గళమెత్తాలి ✻ పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణమూర్తి
✻ పల్లిసారధిలో వంగపండు ప్రసాదరావు సంస్మరణ సభ



# దోపిడీ ఉన్నంత కాలం.. ఉద్యమాలు ఆగవు

పలాస/వజ్రపుకొత్తూరు, ఆగస్టు 4 (వార్త): దేశంలో దోపిడి, అణచివేత ఉన్నంతకాలం ప్రజా ఉద్యమాలను ఎవరూ ఆపలేరని ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు, నిర్మాత ఆర్.నారాయణమూర్తి అన్నారు. మంగళవారం పల్లిసారధిలో ఉత్తరాంధ్ర గొంతుక ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాకవి వంగపండు ప్రసాదరావు సంస్మరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహాకవి వంగపండును ప్రజాకవిగా కొనియాడారని గుర్తు చేశారు. దేశ సంపద ప్రజలదేనని, అది కొద్దిమంది కార్పొరేట్ సంస్థలకు కాకుండా పేద ప్రజలకు చేరాలని అన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఉద్యమాలను అణచివేయాలని ప్రయత్నించినా ప్రజా ఉద్యమాలు ఆగవని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం శత్రు దేశాలతో చర్చలు జరుపుతుందని, అయితే నక్సలైట్లు కోరిన చర్చలకు మాత్రం నిరాకరించడం వల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోయారని విమర్శించారు. విప్లవ భావజాలం పీడిత ప్రజల పక్షాన ఎప్పటికీ సజీవంగా ఉంటుందని, అందుకు పల్లిసారధిలో జరిగిన ఈ సభే నిదర్శనమని అన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర ప్రజల హక్కులను హరించే ప్రయత్నాలు జరిగితే వంగపండు రచించిన పోరాట గీతాల వంటి మరెన్నో పాటలు పుట్టుకొచ్చి ప్రజలను చైతన్యవంతులను చేస్తాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని ఆరోపించారు. ఢిల్లీలో రైతుల ఉద్యమం సందర్భంగా క్షమాపణ చెబుతానన్న ప్రధానమంత్రి ఇప్పటివరకు రైతులను ఎందుకు కలవలేదని ప్రశ్నించారు. దేశ సంపదను దోచుకుంటే నక్సలైట్ ఉద్యమాలు పుట్టుకొస్తాయని పేర్కొన్నారు. నంబల కేశవరావు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించాలన్న విజ్ఞప్తిని కూడా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. కార్గో ఎయిర్‌పోర్టును ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ప్రజాకవి వంగపండుతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా నారాయణమూర్తి గుర్తు చేసుకున్నారు. వంగపండు రచించిన పలు ప్రజాగీతాలను కళాకారులతో కలిసి ఆలపించి సభికులను అలరించారు. ప్రజాసంఘాలు, కళాకారులు ఐక్యంగా ఉండి ప్రజా సమస్యలపై, నిరంకుశ పాలనపై తమ గళాన్ని నిరంతరం వినిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ప్రజా గొంతుక అమ్మ రామక్రిష్ణ అధ్యక్షతన నిర్వహించగా జననాట్య మండలి నాయకుడు సంజీవు, ప్రజాకవి వంగపండు ప్రసాదరావు కుమారులు దుష్యంత్, ప్రజాకళా మండలి నాయకుడు కోటి, ప్రజా కళామండలి రాష్ట్ర కార్యదర్శి నీలకంఠం, లీడర్ పత్రిక ఎడిటర్ రమణమూర్తి, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావు, బహుజన కళామండలి కార్యదర్శి ఉదయ్ భాస్కర్, విప్లవ రచయితల సంఘం (విరసం) కార్యదర్శి అరసవల్లి కృష్ణ, ప్రజా కళా మండలి రాష్ట్ర నాయకులు రాజనరసింహ, వివిధ ప్రజా సంఘాల నాయకులు, కళాకారులు, రచయితలు, మేధావులు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎయిర్ పోర్టు వ్యతిరేక పోరాటానికి సహకరించండి

మందస: పచ్చని ఉద్దానంలో ఎయిర్ పోర్టు పేరిట ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతోంది.. మీరైన ఉద్యమానికి సహకరించి, ఎయిర్ పోర్టు వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములు కావాలని బాధిత రైతులు ప్రముఖ సినీనటుడు, ప్రజా సాంస్కృతిక ఉద్యమ నిర్మాత ఆర్.నారాయణమూర్తికి వినతిపత్రం అందజేశారు. వజ్రపుకొత్తూరు మండలంలని పల్లిసారధి గ్రామానికి వచ్చిన నారాయణమూర్తిని ఎయిర్ పోర్టు భూబాధిత రైతులు కలిసారు. సమస్యలను వివరించారు. ఆయనకు వివరించిన సమస్యలు ఇలా ఉన్నాయి. మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలోని భేతాళపురం, లక్ష్మీపురం, బిడిమి, చీపురుపల్లి, మెట్టూరు రెవెన్యూ గ్రామాలతో పాటు సుమారు 20 గ్రామాల ప్రజలు, కార్గో ఎయిర్‌పోర్టు బాధిత రైతుల తరఫున ఈ వినతిపత్రాన్ని సమర్పిస్తున్నాం. 2024 నవంబర్ నెలలో జిల్లా ఉన్నతాధికారులు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారులు మా గ్రామాల రైతులను సంప్రదించకుండా భూ కొలతలకు రావడంతో అప్పటి నుంచి నేటి వరకు మేమంతా ఏకమై ప్రభుత్వం ప్రతిపాదించిన కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం కొనసాగిస్తున్నాం. ఉద్దానం ప్రాంతంలోని పల్లిసారధి గ్రామంలో మీరు పాల్గొంటున్న కార్యక్రమం సందర్భంగా మా ఆవేదనను మీ ముందుంచుతున్నాం. మా తాతలు, తండ్రుల కాలం నుంచి కొబ్బరి, జీడి, పనస, మామిడి, మునగ, వరి వంటి ప్రధాన పంటలతో పాటు మిరప, వంకాయ, బెండకాయ, బీరకాయ, టమాట, కందదుంపలు, సీతాఫలం వంటి అంతర పంటలను సాగు చేస్తూ గౌరవప్రదమైన జీవనం సాగిస్తున్నాం. ఈ పచ్చని పంట పొలాలే మా కుటుంబాలకు జీవనాధారం. ఈ వ్యవసాయ ఆదాయంతోనే మా పిల్లలకు ఉన్నత విద్యను అందిస్తూ సంతోషంగా జీవిస్తున్నాం. ప్రభుత్వం ప్రతిపాదించిన కార్గో ఎయిర్‌పోర్టు అమలైతే మా పంట భూములు, తోటలు, జీవనాధారం పూర్తిగా నాశనం అవుతాయి. అందువల్ల ఎయిర్‌పోర్టు నిర్మాణం కాకుండా మా ప్రాంతంలో పండే వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడం, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం, ఉద్దానం వ్యవసాయ ఉత్పత్తులను జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లకు చేర్చే చర్యలు చేపట్టాలని మీ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేయాలని మనవి చేస్తున్నాం. గత రెండు సంవత్సరాలుగా మా గ్రామాల రైతులందరూ ఏకగ్రీవంగా తీర్మానం చేసి, మా గ్రామాలకు వచ్చిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు "ఎయిర్‌పోర్టు వద్దు--మా భూములే ముద్దు" అంటూ స్పష్టంగా రాతపూర్వకంగా తెలియజేశాం. అలాగే తహసీల్దార్, ఆర్డీఓ, ప్రత్యేక అధికారులు, జిల్లా కలెక్టర్, స్థానిక శాసనసభ్యురాలు గౌతు శిరీష, కేంద్ర పౌర విమానయానశాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కూడా వినతిపత్రాలు సమర్పించాం. ఈ సందర్భంగా మరోసారి స్పష్టంగా తెలియజేస్తున్నాం. మా జీవనాధారమైన పంట భూముల కోసం అవసరమైతే మా ప్రాణాలను అర్పిస్తాం. కానీ కార్గో ఎయిర్‌పోర్టు కోసం మా గ్రామాల నుంచి ఒక్క సెంటు భూమి కూడా ఇవ్వడానికి మేము సిద్ధంగా లేం. భవిష్యత్తులో మా రైతుల న్యాయమైన పోరాటానికి మీరు, మీ ప్రజా సాంస్కృతిక ఉద్యమాల ద్వారా సంపూర్ణ మద్దతు అందించి, మా సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా కృషి చేయాలని విప్లవ వందనాలతో మనవి చేస్తున్నామని కార్గో ఎయిర్పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు, మీడియా వింగ్ కన్వీనర్ బత్తిని లక్ష్మణ్, దున్న హరికృష్ణ, గుంటు లోకనాథం తదితరులు పాల్గొన్నారు.






## నిబంధనలు పాటించని.. సూర్యతేజ యాజమాన్యం

✻ సామర్థ్యానికి మించి విద్యార్థులను కళాశాల బస్సుల్లో తరలింపు
✻ పొంచివున్న ప్రమాదం
✻ రవాణా భద్రతపై తల్లిదండ్రుల ఆందోళన
✻ ఆర్టీవో అధికారులు తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

## సూర్యతేజలో విద్యార్థినుల భద్రతపై జనసేన ఆందోళన

✻ పోక్సో కేసు నేపథ్యంలో కాలేజీల తనిఖీలకు డిమాండ్
✻ ఆర్ఐఓ వెంటనే పలాసకు వచ్చి పరిస్థితిని సమీక్షించాలని హరీష్ కుమార్ శ్రీకాంత్ విజ్ఞప్తి

## సూర్యతేజ నిర్లక్ష్యంపై యూత్ కాంగ్రెస్ ఆగ్రహం

✻ కళాశాల గుర్తింపు రద్దు చేయాలి ✻ యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలి
✻ జిల్లా యూత్ కాంగ్రెస్ నేత డాక్టర్ పూడి కిరణ్ కుమార్

లోపల పేజీల్లో

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించాలి

**జలుమూరు, ఆగస్టు 4 (వార్త):** గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు పదోన్నతుల విషయంలో ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ఆయా శాఖల ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర శాఖల ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తున్నప్పటికీ తమ రెండు విభాగాలను మాత్రం ప్రభుత్వం విస్మరించిందని వారు ఆరోపిస్తున్నారు. జలుమూరు మండలంలోని సచివాలయాల్లో పనిచేస్తున్న పలువురు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ తమతో పాటు నియమితులైన ఇతర శాఖల ఉద్యోగులకు పదోన్నతుల అవకాశాలు కల్పించగా, తమకు మాత్రం అలాంటి అవకాశం లేకపోవడం నిరాశ కలిగిస్తోందన్నారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన వివిధ సేవలను అందించడంలో తాము కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, బాధ్యతలకు తగిన గుర్తింపు, వేతన ప్రయోజనాలు, పదోన్నతులు లభించడం లేదని పేర్కొన్నారు. ఇతర శాఖల ఉద్యోగులతో సమానంగా, కొన్ని సందర్భాల్లో అంతకంటే ఎక్కువగా పని చేస్తున్నప్పటికీ ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సేవలను గుర్తించి ప్రభుత్వం వెంటనే ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు పదోన్నతి అవకాశాలు కల్పించడంతో పాటు ఉద్యోగ భద్రత, కెరీర్ పురోగతికి అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లపై సానుకూలంగా స్పందించి తగిన నిర్ణయం తీసుకోవాలని సంబంధిత శాఖల ఉద్యోగులు విజ్ఞప్తి చేశారు.

### సచివాలయాల్లో సిబ్బంది కొరత

జలుమూరు మండలంలోని గ్రామ సచివాలయాల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉండటంతో ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది కొరత కారణంగా అనేక సచివాలయాలు ఇన్‌చార్జిలతోనే కొనసాగుతుండటంతో ప్రజలు నెలల తరబడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోతున్నారు. మండలంలో మొత్తం 115 గ్రామాలకు 24 గ్రామ సచివాలయాలు ఉండగా, చాలా సచివాలయాల్లో అవసరమైన సిబ్బంది లేకపోవడం వల్ల సేవల నిర్వహణ మందగించింది. ముఖ్యంగా డిజిటల్ అసిస్టెంట్ పోస్టుల్లో అనేక ఖాళీలు ఉండటంతో కొన్ని సచివాలయాల్లో ఒక్కరే విధులు నిర్వహిస్తూ అన్ని సేవలను అందించాల్సిన పరిస్థితి నెలకొంది. ఏ పని కోసం సచివాలయానికి వెళ్లినా సంబంధిత సిబ్బంది అందుబాటులో లేకపోవడం, ఉన్న కొద్దిమంది ఉద్యోగులపై పనిభారం అధికంగా ఉండటంతో ప్రజలు నిరీక్షించాల్సి వస్తోందని స్థానికులు తెలిపారు. ప్రజల నుంచి వచ్చే వినతులు, ప్రభుత్వ సేవలు, ధ్రువపత్రాల జారీ వంటి పనులు ఆలస్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం ప్రతి గ్రామ సచివాలయంలో 10 నుంచి 13 మంది వరకు ఉద్యోగులు విధులు నిర్వహించేవారని, ప్రస్తుతం ఆ సంఖ్య మూడు నుంచి నలుగురికి పరిమితమైందని స్థానికులు చెబుతున్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను ఎందుకు భర్తీ చేయడం లేదో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని వారు కోరుతున్నారు. సిబ్బంది కొరత సమస్యను ఎంపీడీవో దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఇప్పటి వరకు ఎలాంటి పరిష్కారం లభించలేదని గ్రామస్థులు వాపోయారు. ముఖ్యంగా పెద్ద గ్రామ పంచాయతీల్లో కూడా ఇదే పరిస్థితి ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి గ్రామ సచివాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి, గతంలో మాదిరిగా పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు. దీంతో ప్రభుత్వ సేవలు వేగవంతమై ప్రజలకు మెరుగైన సేవలు అందే అవకాశం ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

* పెండింగ్ డీఏ మంజూరు చేయాలి * పీఆర్సీ కమిటీ నియమించాలి * 50ఏళ్లు దాటిన ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేయాలి
* యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జయరాం మాలి



**మందస, ఆగస్టు 4(వార్త):** ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిండంలేదు.. పెండింగ్ సమస్యలను పట్టించుకోవడంలేదు.. చెప్పింది ఒకటి, చేస్తోంది మరొకటి.. తక్షణమే ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి, న్యాయం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జయరాంమాలి కోరారు. మందస పట్టణంలోని ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి మాకు రావలసిన పెండింగ్ డీఏలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సుమారు రెండున్నర సంవత్సరాల నుంచి సరెండర్ లీవ్స్ కేస్ ఎన్కేస్మెంట్ కూడా ఇవ్వడం లేదన్నారు. పే రివిజన్ కమిటీను కూడా నియమించలేదని, దీంతో ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతోందన్నారు. కనీసం ఐఆర్ కూడా ఇవ్వడం లేదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వంపైన ఎన్నో ఆశలు పెట్టుకున్న ప్రభుత్వ ఉద్యోగులకు ఇప్పటికైనా స్పందించి మా కోరికలను నెరవేరుస్తారని కోరుతున్నామన్నారు. అదేవిధంగా 50సంవత్సరాలు దాటిన ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేయాలని కోరారు. వయోభారం సమస్యలతో ఇప్పటికే బాధ పడుతున్న 50ఏళ్లు దాటిన ఉపాధ్యాయులకు చూపు, అనారోగ్యం తదితర సమస్యలు వేధిస్తున్నాయని, వీరు టెట్‌లో ఎలా అర్హత సాధించగలరని ప్రశ్నించారు. ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని జయరాంమాలి డిమాండ్ చేశారు.

## విద్యార్థులు విజయ పథంలో సాగాలి

**కవిటి ఆగస్టు 4 (వార్త):** విద్యార్థి దశ జీవితంలో అత్యంత కీలకమని, విద్యార్థులు విజయ పథంలో సాగాలని మధ్యలో ఆగిపోకూడదని ప్రముఖ మనో వికాస నిపుణులు, జాగృతి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రాంబుడ్డి గణపతి విద్యార్థులను ఉద్బోధించారు. మంగళవారం కవిటి మండలంలోని బి.గొనపపుట్టుగు ఉన్నత పాఠశాల విద్యార్థులకు జీవిత పాఠం - జీవన నైపుణ్యాలు అనే అంశంపై మాట్లాడుతూ జీవితంలో వెలుగు చీకటి ఉంటుందని అది ప్రతి ఒక్కరు జీవితంలో స్వాభావికమని భావించాలని అంతే గాని చీకటి లేని, సమస్యలు లేని ప్రపంచం కోరుకుంటే మీరు చీకటిలోనే మిగిలిపోతారని జీవితంలో సుఖము దుఃఖము బండి చక్రం వలె తిరుగుతుంటాయని వాటిని సవాళ్లుగా స్వీకరించినవాళ్లే విజేతలుగా నిలిచారని అన్నారు. అటువంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని జీవించాలి గాని నిరాశ నిస్పృహలతో కుంగిపోకూడదని హితవు పలికారు. పాఠశాల ప్రధానాచార్యులు వీరభద్రరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు అధ్యాపకులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# శ్రమించారు.. సత్తా చూపించారు

* జిల్లా మీట్, సౌత్ జోన్ సెలక్షన్లలో కేజీబీవీ విద్యార్థిల ప్రతిభ * పీఈటీ గంగు సంతోషి ఆధ్వర్యంలో పతకాలు
* అభినందించిన ఎస్ఓ ఆర్.వాసంతి




**మందస, ఆగస్టు 4(వార్త):** కేజీబీవీ విద్యార్థినిలు క్రీడల్లో సత్తా చూపుతున్నారు. పతకాలు గెలవాలన్న పట్టుదలతో శ్రమించి, విజయం సాధిస్తున్నారు. పీఈటీ గంగు సంతోషి ఆధ్వర్యంలో విద్యార్థినిలు తమ ప్రతిభను చూపుతున్నారు. ఇటీవల జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం కోడిరామమూర్తి స్టేడియంలో కొన్న చిన్నారావు మెమోరియల్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్-2026 జిల్లా మీట్, సౌత్ జోన్ సెలెక్షన్స్ లో మందస మండలంలోని వీరగున్నమ్మపురం వద్ద గల కస్తూరిబాగాంధీ విద్యాలయం విద్యార్థినులు పాల్గొన్నారు. అండర్-16 విభాగంలో వై.చాందిని 600మీటర్స్ లో మొదటి స్థానం, 60మీటర్స్ లో రెండవ స్థానం గెలుపొందింది. అలాగే వై.జ్ఞానేశ్వరి జావెలిన్ త్రోలో 2వస్థానం, లాంగ్ జంప్ లో 2వ స్థానం కైవసం చేసుకుంది. ఇదే కేటగిరీలో ఎస్.సింధు లాంగ్ జంప్ లో మూడవ స్థానం గెలుపొందింది. అండర్ 14కేటగిరిలో బి.మేఘన ట్రైయాతలాన్ బి గ్రూప్ లో రెండవ స్థానం, ఎస్.కల్పన ట్రైయాతలాన్ సి గ్రూపులో 3వ స్థానం సాధించింది. వీరిలో వై.చాందిని తిరుపతిలోఈ నెలలో జరగబోవు రాష్ట్ర స్థాయికి సెలెక్ట్ అయింది. స్థానిక ఎంఎల్ఏ గొండు శంకర్, రాజాం ఎంఎల్ఏ కొండ్రు మురళి, కొన్న వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. విజేతలను ఎస్ఓ రఘుపాత్రుని వాసంతి అభినందించారు. కేజీబీవీకు మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.















## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు విద్యార్థులు

**నరసన్నపేట, ఆగస్టు 4(వార్త):** శ్రీకాకుళం కేఆర్ స్టేడియంలో సోమవారం నిర్వహించిన కొన్న చిన్నారావు మెమోరియల్ జిల్లా అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో నరసన్నపేట పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. వివిధ అథ్లెటిక్ విభాగాల్లో పోటీపడిన విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శనతో తిరుపతిలో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు. జావెలిన్ త్రో విభాగంలో టి. షణ్ముఖ ప్రియ, హైజంప్‌లో జి. తేజ, లాంగ్ జంప్‌లో కె. ఉషారాణి, కె. స్వప్న, హైజంప్‌లో పి. గీతశ్రీ రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు అభినందించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకువచ్చిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలోనూ రాణించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయంలో శారీరక విద్య ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం అందించిన శిక్షణ, తల్లిదండ్రుల సహకారం కీలక పాత్ర పోషించాయని పాఠశాల వర్గాలు పేర్కొన్నాయి. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# రాష్ట్ర భవిష్యత్‌కు.. యువత ప్రశ్నించాలి

* ప్రజాస్వామ్యాన్ని కాపాడే బాధ్యత ప్రజలదే
* ప్రభుత్వ ఆస్తులను ఇష్టారాజ్యంగా పంచిపెట్టే అధికారులు ఎవరికీ లేదు
* లోకేష్ వ్యాఖ్యలు అధికార అహంకారానికి నిదర్శనం
* విద్యను నిర్వీర్యం చేస్తూ రాష్ట్ర భవిష్యత్తును దెబ్బతీస్తున్నారు
* డీఎస్సీలో మెగా అక్రమాలు జరిగాయి
* మెరిట్ అభ్యర్థులను పక్కన పెట్టేశారు
* మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు
* శ్రీకాకుళంలో వైసీపీ రౌండ్ టేబుల్ సమావేశం



**శ్రీకాకుళం, ఆగస్టు 4 (వార్త):** ప్రజాస్వామ్యంలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు చట్టానికి, రాజ్యాంగానికి, ప్రజాస్వామ్య సంప్రదాయాలకు విరుద్ధంగా పాలన సాగిస్తే వాటిని చైతన్యవంతమైన సమాజం తప్పనిసరిగా సరిదిద్దాల్సిన బాధ్యత ఉందని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మంగళవారం శ్రీకాకుళం నగరంలోని శ్రీ ఫంక్షన్ హాల్‌లో వైసీపీ శ్రేణులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇటీవల విద్యాశాఖ మంత్రి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, ప్రభుత్వ భూమిని 90 పైసలకు ఇస్తున్నారని ప్రశ్నించగా, “90 పైసలకు ఏంటి… మొత్తం భూమి కూడా ఇచ్చేస్తా” అని మంత్రి చెప్పడం ప్రజాస్వామ్య విలువలను అవమానపరచడమేనన్నారు. ప్రజలు ఐదేళ్ల పాటు పరిపాలన బాధ్యతను ట్రస్టీలుగా ప్రభుత్వానికి అప్పగిస్తారని, ప్రభుత్వ ఆస్తులను ఇష్టారాజ్యంగా పంచిపెట్టే అధికారం ఎవరికీ లేదన్నారు. ప్రభుత్వ భూముల కేటాయింపుపై నిర్ణయం తీసుకునే అధికారం రాష్ట్ర కేబినెట్‌కే ఉంటుందని, విధివిధానాలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. మంత్రి చేసిన వ్యాఖ్యలు అధికార అహంకారానికి నిదర్శనమని అన్నారు. డీఎస్సీ నియామకాల వ్యవహారంపై మాట్లాడుతూ, విద్యాశాఖ మంత్రే అక్రమాలకు మార్గం సుగమం చేశారని ఆరోపించారు. పరీక్ష నిర్వహణకు ముందే నోటిఫికేషన్‌లో కొందరికి అనుకూలంగా వెసులుబాట్లు కల్పించారని, ఆ అక్రమాలకు అనుగుణంగా జీవోలు జారీ చేశారని అన్నారు. అర్హులను, మెరిట్ ఉన్న అభ్యర్థులను పక్కనబెట్టి నియామకాలు చేపట్టారని, అనంతరం ఆ జీవోలను వెనక్కి తీసుకోవడం ద్వారా తప్పును ప్రభుత్వమే అంగీకరించినట్లైందన్నారు. జాతీయ స్థాయిలో నీట్ పరీక్ష నిర్వహణలో లోపాలు తలెత్తినప్పుడు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సి వచ్చిందని, అక్కడ మంత్రి ప్రత్యక్షంగా తప్పు చేయకపోయినా బాధ్యత స్వీకరించాల్సి వచ్చిందన్నారు. అయితే ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన డీఎస్సీ అక్రమాల్లో మాత్రం విద్యాశాఖ మంత్రే నేరుగా పాత్ర పోషించారని ఆరోపించారు. ప్రభుత్వాన్ని గాడిలో పెట్టేందుకు సమాజం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ న్యాయనిర్ణేతలని ధర్మాన అన్నారు. అణచివేతలతో కొంతకాలం ప్రజల గొంతును మూయించవచ్చేమోగానీ, ప్రజల శక్తి ముందు ఏ ప్రభుత్వం నిలవలేదని పేర్కొన్నారు. ప్రజాభిప్రాయాన్ని కూడగట్టేందుకు చైతన్యవంతులు ముందుకు వచ్చి ప్రజలను చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. సమ సమాజ నిర్మాణానికి విద్యే ప్రధాన ఆయుధమని పేర్కొన్న ధర్మాన, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా పేదరికం విద్యకు అడ్డంకి కాకుండా చేశారని గుర్తు చేశారు. అనంతరం వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్యారంగంలో మరిన్ని సంస్కరణలు తీసుకొచ్చి ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించే దిశగా కృషి చేశారని తెలిపారు. అయితే గత ప్రభుత్వాలు కల్పించిన విద్యా సదుపాయాలను ప్రస్తుత ప్రభుత్వం తొలగిస్తూ, సమాజంలోని అసమానతలను తగ్గించే విద్యా వ్యవస్థనే నిర్వీర్యం చేస్తోందన్నారు. సమాజం కోసం పని చేస్తున్న ప్రతి ఒక్కరూ ఇలాంటి అంశాలపై నిర్భయంగా గొంతు విప్పి మాట్లాడాలి. లేకపోతే ఈ రాష్ట్రంలో పేదరికం, అసమానతలు, సామాజిక అంతరాలు ఎన్ని శతాబ్దాలు గడిచినా తొలగవు. సహజ వనరులు, సంపద సమృద్ధిగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోనూ విద్యా రంగంలో ఇంకా వెనుకబడి ఉండటం బాధాకరం. అక్షరాస్యతలో రాష్ట్రం ఆశించిన స్థాయికి చేరుకోలేదు. పేద, ధనిక వర్గాల మధ్య అంతరాలు తగ్గలేదు. సమ సమాజ నిర్మాణానికి బలమైన పునాదులు పడాలంటే యువత పెద్దఎత్తున ముందుకు వచ్చి పోరాడాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ పరిపాలన ఎల్లప్పుడూ నిష్పక్షపాతంగా ఉండాలి. ఇది ఎవరి దయాదాక్షిణ్యాల వల్ల లభించే అవకాశం కాదు, రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన హక్కు. ఆ హక్కులను పరిరక్షించేందుకు ప్రజలు చైతన్యవంతంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలపై విశ్వాసం ఉంచి సంక్షేమాన్ని ప్రతి ఇంటికీ చేర్చాలనే సంకల్పంతో పనిచేసిన నాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. ప్రస్తుతం తెలుగుదేశం ప్రభుత్వం పరిపాలనలో వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు అసత్య ప్రచారాలనే ఆశ్రయిస్తోందని విమర్శించారు. ‘సాచురేషన్’ విధానం అంటే ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమ పథకం అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి, కులం, మతం, ప్రాంతం, రాజకీయ అనుబంధం అనే తేడా లేకుండా చేరాలని భావించడం. ఆ ఆలోచనను ఆచరణలో పెట్టిన నాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని ధర్మాన పేర్కొన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా సంక్షేమాన్ని అందరికీ సమానంగా అందించే పాలన గత ప్రభుత్వంలో కనిపించిందని అన్నారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉందన్నారు. ప్రభుత్వం గొప్ప పరిపాలన అందిస్తున్నామని చెప్పుకుంటున్నా, కొత్త అర్హులకు పెన్షన్లు అందడం లేదని, సంక్షేమంలోనూ, ఉద్యోగాల విషయంలోనూ రాజకీయాలు, కులాలు, మతాలు, వర్గాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. నిష్పక్షపాతంగా పాలించాలంటే ఆత్మవిశ్వాసం, ప్రజలపై నమ్మకం అవసరమని, ఆ ధైర్యం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ఉందన్నారు. కానీ రాష్ట్రంలో జరిగిన ఉద్యోగ నియామకాల ప్రక్రియలో బహిరంగంగా అక్రమాలు జరిగాయని, ముఖ్యంగా డీఎస్సీ నియామకాలలో రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లు, మెరిట్‌ను విస్మరించి వ్యవహరించారనీ.. గత ప్రభుత్వ హయాంలో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా సుమారు రెండు లక్షల మందికి పారదర్శకంగా ఉద్యోగాలు కల్పించామని గుర్తు చేశారు. ఆ నియామకాలపై ఏ రాజకీయ పార్టీ కూడా అక్రమాల ఆరోపణ చేయలేదని, అంత పారదర్శకంగా నియామకాలు జరిగాయని పేర్కొన్నారు. ప్రజల ప్రయోజనాలను కాపాడే నాయకత్వం ఏదో, స్వప్రయోజనాలను కాపాడే నాయకత్వం ఏదో ప్రజలు ఆలోచించాలని ధర్మాన పిలుపునిచ్చారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం యువత ముందుకు వచ్చి అన్యాయాలను ప్రశ్నించాలని, ప్రజాస్వామ్యంలో చివరికి విజయం ప్రజలదేనని అన్నారు.

## పాతపట్నంలో వైసీపీ రౌండ్ టేబుల్ సమావేశం

**పాతపట్నం, ఆగస్టు 4 (వార్త):** మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు పాతపట్నంలోని వైసిపి క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి నాయకత్వంలో నియోజకవర్గ స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం మంగళవారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం విద్యార్థులు, యువతకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని రెడ్డిశాంతి ఆరోపించారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని, నైతిక బాధ్యత వహిస్తూ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు, ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ భృతి చెల్లించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కూటమి ప్రభుత్వానిది.. కక్షపూరిత రాజకీయం

* వైసీపీ నేతల ఆగ్రహం * మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్‌పై అక్రమ కేసులా?
* శాంతియుత ర్యాలీలకు భయపడి పోలీసులతో బెదిరింపులా? * కూటమి ప్రభుత్వ అణచివేత ధోరణి సిగ్గుచేటు * రాష్ట్ర కళింగ విభాగం అధ్యక్షులు ఆరంగి మురళీధర్



**నరసన్నపేట, ఆగస్టు 4 (వార్త):** వైసీపీ సీనియర్ నాయకులు, పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్‌పై శ్రీకాకుళం రూరల్, ఆమదాలవలస, ఎచ్చెర్ల, జేఆర్‌పురం, గార పోలీస్ స్టేషన్లలో వరుసగా అక్రమంగా కేసులు నమోదు చేయడాన్ని ఆ పార్టీ నాయకులు ధ్వజమెత్తారు. మంగళవారం నరసన్నపేటలో వైసీపీ శ్రేణులు నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కళింగ విభాగం అధ్యక్షులు ఆరంగి మురళీధర్ తదితరులు మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం, ప్రజల పక్షాన పోరాడడం రాజ్యాంగం కల్పించిన హక్కు. ప్రజల స్వేచ్ఛను, హక్కులను కాలరాస్తూ వైఎస్సార్‌సీపీ నేతలను అణచివేయాలని కూటమి ప్రభుత్వం చూస్తోందన్నారు. అనుమతులకు విరుద్ధంగా ర్యాలీలు నిర్వహించారనే నెపంతో అక్రమ కేసులు బనాయించడం కక్షపూరిత రాజకీయం తప్ప మరొకటి కాదని విమర్శించారు. ప్రజా సమస్యలపై గొంతు విప్పుతున్న ధర్మాన కృష్ణదాస్‌కు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకే ఈ తప్పుడు కేసులు మోపారని, ఇటువంటి బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని, కేసులకు భయపడేది లేదని, కూటమి వైఫల్యాలను ఎండగడతామని జలుమూరు ఎంపీపీ వాన గోపి అన్నారు. జేఆర్‌పురం, ఆముదాలవలస, ఎచ్చెర్ల వంటి పలు పోలీస్ స్టేషన్లలో ఒకే రకమైన ఆరోపణలతో వరుస కేసులు నమోదు చేయించడం వెనుక ఉన్నది అధికార పార్టీ కుట్రలేనని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందన్నారు. ప్రజల్లో వస్తున్న తిరుగుబాటును, వైఎస్సార్‌సీపీ మద్దతును తట్టుకోలేకనే పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని రాజకీయం చేస్తున్నారు. శాంతిభద్రతల విఘాతం అంటూ తప్పుడు ప్రచారాలు చేయడం హాస్యాస్పదమని వాన గోపితీవ్రంగా మండిపడ్డారు. ధర్మాన కృష్ణదాస్ శ్రీకాకుళం జిల్లా ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడని, ఆయనపై ఎన్ని కేసులు పెట్టినా జిల్లా ప్రజలు వైఎస్సార్‌సీపీ వెంటే ఉంటారని పేర్కొన్నారు.న్యాయపోరాటం చేస్తాం.. ప్రజల తరపున పోరాడతాం!కూటమి ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా చట్టపరంగా ఎదుర్కొంటామని, న్యాయస్థానాల్లో ఈ అక్రమాలకు తగిన బుద్ధి చెబుతామని నాయకులు స్పష్టం చేశారు. పోలీసు అధికారులు కూడా అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి అక్రమ కేసులు బనాయించడం మానుకోవాలని, ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం ఆపేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొందర కూరకుల విభాగం అధ్యక్షులు రాజపు అప్పన్న, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షులు దామ మన్మధరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి బురల్లి శంకర్ రావు, రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి బంకుపల్లి లోకనాథం శర్మ,మండల అధ్యక్షులు లుకలాపు రవికుమార్, మండల బూత్ కమిటీ అధ్యక్షులు బబ్బోది ఈశ్వరరావు, వైస్ ఎంపీపీ పాగోటి రాజారావు, మండల ఉప అధ్యక్షులు నేతింటి రాజేశ్వరరావు, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి కోటిపల్లి శ్రీనివాస్, గొండు విశ్వనాథం , మండల ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ తవిటినాయుడు, రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి కనపల అరవింద్, మండల యూత్ కార్యదర్శి పొట్నూరు పృధ్వీరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

# 6 నుంచి 15 వరకు సీపీఐ పాదయాత్రలు

**సెప్టెంబర్ 1 చలో ఢిల్లీ కార్యక్రమం * రాష్ట్ర ఏఐవైఎఫ్ కార్యదర్శి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మొజ్జాడ యుగంధర్**



**నరసన్నపేట, ఆగస్టు 4 (వార్త):** రాష్ట్ర వ్యాప్త ప్రచార పాదయాత్రలను ఈనెల 6వ తేదీ నుండి 15వ తేదీ వరకు నిర్వహించనున్నామని, అలాగే సెప్టెంబర్ ఒకటవ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని సైతం జయప్రదం చేయాలని రాష్ట్ర ఏఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి మొజ్జాడ యుగంధర్ కోరారు. స్థానిక లక్ష్మీ టాకీస్ అంబేద్కర్ విగ్రహం వద్ద చలో ఢిల్లీ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ దేశ సమైక్యతను సమగ్ర అభివృద్ధి సాధనే లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ జాతీయ సమితి పిలుపు భాగంగా ప్రచార పాదయాత్రలను జరుగుతున్నాయని తెలిపారు. సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రెండు కోట్ల ఉద్యోగాలు, నల్లధనం వెలికితీత దేశీయత, మేక్ ఇండియా సమగ్ర అభివృద్ధి వంటి ఎన్నికల వాగ్దానాలు అధికారంలో వచ్చిన 12 సంవత్సరాల గడిచిన అమలు చేయడంలో బిజెపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి కులం పేరుతో మతం పేరుతో ప్రాంతం పేరుతో రాజకీయాలకు పాల్పడుతుందని తెలిపారు. సీబీఐ, ఈడీ వంటి స్వతంత్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటూ ఎన్నికల కమిషన్‌ను న్యాయస్థానాన్ని కూడా వాడుకుంటూ భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ ప్రజాస్వామ్యాన్ని నిలువునా ఖూనీ చేస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వ సంస్థలను ఒక్కొక్కటిగా అమ్ముతూ కార్మిక చట్టాలను మార్పులు చేసి శ్రమ దోపిడీకి ద్వారాలను కేంద్ర ప్రభుత్వం తెరుస్తుందన్నారు. ఈ మధ్యకాలంలో వరస పేపర్ల లీకేజీలతో ప్రభుత్వం మీద నమ్మకం కోల్పోయే విధంగా వ్యవహరిస్తున్నారని, లక్షలాదిమంది విద్యార్థులు జీవితాలతో చెలగాటమాడుతున్న వారిని అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈనెల14నరసన్నపేట జరిగే ప్రచార పాదయాత్రను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఆర్ అరవింద్, సిపిఐ సీనియర్ నాయకులు, నెయ్యల నారాయణ రావు, లవకుమార్, సింహాద్రి భాస్కరరావు, లక్ష్మి, వసంత్, కిరణ్ పాల్గొన్నారు.

# మంత్రి లోకేష్ రాజీనామా చేసే వరకూ పోరాటం

**ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలి * నిరుద్యోగ భృతి 3000 వెంటనే ఇవ్వాలి * వైసీపీ నేతల డిమాండ్**



**టెక్కలి, ఆగస్టు 4 (వార్త):** వైసిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి పిలుపు మేరకు టెక్కలి నియోజకవర్గ ఇంచార్జ్ పేరాడ తిలక్ ఆదేశానుసారం మంగళవారం టెక్కలి పార్టీ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది .ఈ కార్యక్రమంలో హాజరైన నాయకులు, వక్తలు డీఎస్సీలో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ వేయాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను టీడీపీ ప్రభుత్వం దగా చేసిందన్నారు. ఉపాధ్యాయ పోస్టులను అమ్ముకున్నారన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రికి లోకేష్ తెలిసే ఇదంతా జరుగుతుందన్నారు. తక్షణం విద్యాశాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గడచిన వైసీపీ పాలనలో నిబద్ధతతో పారదర్శకంగా పెద్ద ఎత్తున ఉద్యోగాల నియామకం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో టెక్కలి నియోజకవర్గ పరిశీలకులు చల్లా రవి కుమార్, నాలుగు మండలాల మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిలో వివిధ హోదాల్లో ఉన్న పార్టీ ప్రతినిధులు, ఎంపీటీసీ సభ్యులు,మాజీ సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాలల భద్రత, సంక్షేమానికి మొదటి ప్రాధాన్యం

**బాలల హక్కులకు భంగం కలిగితే సహించం * ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ సూర్యనారాయణ రాజు * పాఠశాలలు, స్కానింగ్ సెంటర్ల తనిఖీ**



**శ్రీకాకుళం, ఆగస్టు 4 (వార్త):** రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణకు, సంక్షేమానికి తమ కమిషన్ అత్యంత ప్రాధాన్యతనిసుతష్ట్ర&ందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి ఎ.వి.ఎస్. సూర్యనారాయణ రాజు స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన తొలిరోజు పర్యటన సందర్భంగా ఆయన



మాట్లాడుతూ... బాలల భద్రత, విద్యా ప్రమాణాలు, వసతి గృహాల్లో సౌకర్యాలపై రాష్ట్ర వ్యాప్తంగా క్షేత్రస్థాయి పరిశీలనలు వేగవంతం చేసినట్లు తెలిపారు. పర్యటనలో భాగంగా కమిషన్ సభ్యులు గంగా సూర్యనారాయణ రాజు, డాక్టర్ పి. నాగమానస, డాక్టర్ శ్రీనివాసమూర్తిలతో కలిసి శ్రీకాకుళం పట్టణంలోని మావూరి వీధి అంగన్‌వాడీ కేంద్రం, 7 రోడ్ల కూడలిలోని ఎన్టీఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల, డే అండ్ నైట్ జంక్షన్‌లోని శ్రీకరి స్కానింగ్ సెంటర్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశామని వెల్లడించారు. అనంతరం అరసవిల్లిలోని శిశుగృహ, ప్రభుత్వ మహిళా కళాశాల హాస్టల్, ఆర్అండ్ బి అతిథి గృహం సమీపంలోని శాంతా కళ్యాణ్ అనురాగ నిలయం చైల్డ్ కేర్ హోమ్‌లను సందర్శించి చిన్నారులకు అందుతున్న రక్షణ, నిర్వహణ తీరును పరిశీలించినట్లు పేర్కొన్నారు. బాలల హక్కులకు భంగం కలిగినా, సంక్షేమ పథకాల అమలులో అలసత్వం వహించినా సహించేది లేదని హెచ్చరించారు. ఈ క్షేత్రస్థాయి తనిఖీల ఆధారంగా బుధవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే సమీక్షా సమావేశానికి అన్ని శాఖల అధికారులు సమగ్ర నివేదికలతో హాజరుకావాలని, కమిషన్ ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. కమిషన్ తో పాటు పర్యటించిన వారిలో ఐసిడిఎస్ పిడి ఎస్.సువర్ణ, బాలల రక్షణ అధికారి రమణ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పక్కా ఏర్పాట్లతో స్వాతంత్ర్య దినోత్సవానికి సిద్ధం కావాలి

**జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్**



**శ్రీకాకుళం, ఆగస్టు 4 (వార్త):** పక్కా ఏర్పాట్లుతో స్వాతంత్ర్య దినోత్సవానికి సిద్ధం కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ ఆదేశించారు. ఆగస్టు 15కు సంబంధించి స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన జిల్లా అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా శాఖలు ప్రభుత్వ పథకాలపై శకటాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ సందేశం తయారు చేయాలని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి చెన్నకేశవరావును ఆదేశించారు. వేదిక ఏర్పాట్లు ఆర్ అండ్ బి ఎస్ఈ చూడాలన్నారు. ఏ ఏ ఏర్పాట్లు చేస్తారో వివరాలు అందజేయాలని తహసీల్దార్ ను



ఆదేశించారు. త్రాగునీరు ఏర్పాట్లను ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ చూడాలన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, ఐసిడిఎస్, మత్స్యశాఖ, మెప్మా, హార్టీ కల్చర్, సెరికల్చర్, తదితర శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యోగంలో తమ ఉత్తమ ప్రతిభ చూపిన ఉద్యోగులకే సర్టిఫికేట్ కు ప్రతిపాదన చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు థీం పై ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్లు జి. జయదేవి, లావణ్య, ఆర్డీఓలు కె. సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, అప్పలరాజు, ఆర్ అండ్ బి ఎస్ఈ సత్యనారాయణ, జడ్పీ సిఈఓ వెంకటరామన్, డిఆర్డీఎ పిడి కిరణ్ కుమార్, డ్వామా పీడీ లవరాజు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. శ్రావణ్ కుమార్, వ్యవసాయ శాఖ జెడి వెంకట మురళి కృష్ణ, జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. రవిబాబు, ఎపిసి వేణుగోపాలరావు, మత్స్యశాఖ జెడి సుమలత, ఎస్సీ కార్పొరేషన్ ఈడి గడ్డెమ్మ, సైనిక సంక్షేమ అధికారి శైలజ, ఇన్ చార్జ్ డిఎంహెచ్ఓ శ్రీకాంత్, సిపిఓ లక్ష్మి ప్రసన్న, డిఎస్ఓ సూర్య ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యోగ నైపుణ్యాలే లక్ష్యంగా కాంపిటేటివ్ సెల్

**నరసన్నపేట, ఆగస్టు 4 (వార్త):** అకడమిక్ పాఠ్యాంశాలతో పాటు పోటీపరీక్షల్లో విజయం సాధించడమే లక్ష్యంగా క్వాంటిటేటివ్ సెల్‌ను ఏర్పాటు చేయడం శుభ సూచకమని ఇంటర్ విద్య జిల్లా వృత్తి విద్యా శాఖ అధికారి రేగ సురేష్ కుమార్ అన్నారు. ప్రిన్సిపాల్ పవన్ మరపట్ల ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే మొదటి సారిగా ప్రభుత్వ జూనియర్ కళాశాల నరసన్నపేటలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జనరల్ నాలెడ్జ్ వర్తమాన వ్యవహారాలపై అవగాహన పెంచేందుకు గాను సెల్ ఏర్పాటు చేశామని ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రతిరోజు పలు దినపత్రికలతో పాటు యోజన, ఫైన్ ఇండియా, సైన్స్ రిపోర్టర్ వంటి మేగజైన్స్ ను, ప్రభుత్వం సరఫరా చేసిన ఆబ్జెక్టివ్ పోటీ పరీక్షల మెటీరియల్స్‌ను విద్యార్థులకు అందుబాటులో ఉంచామన్నారు. సాధారణ తరగతులతో పాటు పుస్తకం పఠనం, తెలుగుభాషపై పట్టు, వర్తమాన వ్యవహారాలపై అవగాహన పెంచేందుకు గాను క్వాంటిటేటివ్ సెల్ ఉపయోగపడుతుందనీ ఆమదాలవలస కాలేజీ ప్రిన్సిపాల్ బి.శ్యాం సుందర్ అన్నారు. కుదురుగా ఒకచోట కూర్చుని ఏకాగ్రతతో చదివే అలవాటు పోటీ పరీక్షల ప్రాక్టీసు ద్వారా సాధ్యమవుతుందనీ ఫిజిక్స్ అధ్యాపకులు అన్నపూర్ణారావు తెలిపారు. పోటీ పరీక్షల్లో రాణించాలంటే పత్రికలు, మేగజైన్లు తప్పనిసరిగా చదవాల్సిందేనని అధ్యాపకులు సురవరపు సత్యనారాయణ, వదనగిరి, శివరాంప్రసాద్, సోమశేఖర్, డాక్టర్ మల్లేష్, వేణుగోపాలరావు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జి.శాంతారావు, జోశ్యుల హరిప్రసాద్, దుగ్గివలస రాంప్రసాద్, కొర్రాయి రవి, ఈశ్వరరావు, కూన హరిప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాయితీ బియ్యం విక్రయాలు ప్రారంభం

**ఆమదాలవలస, ఆగస్టు 4 (వార్త):** మార్కెట్ ధరలతో పోలిస్తే నాణ్యమైన బియ్యాన్ని గణనీయమైన తగ్గింపుతో రైతు బజార్లలో అందిస్తున్నామని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం అందించే ప్రత్యేక విక్రయ కార్యక్రమం ఆమదాలవలసలో ప్రారంభమైంది. రైతు బజార్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర ధరల నుంచి పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కలిగించేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బోయిన్ రమేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, పౌర సరఫరాల శాఖ అధికారులు, వినియోగదారులు పాల్గొన్నారు.





## మునసబుపేట డ్రైనేజీ సమస్య పరిష్కరించాలి

**పోలాకి, ఆగస్టు4 (వార్త):** పోలాకి మండలం కుసుమపాలవలస పంచాయతీ పరిధిలోని మునసబుపేట గ్రామంలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు రావాడ అప్పన్న రాజు సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి గ్రీవెన్స్‌లో శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రహదారులపైకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దుర్గంధంతో పాటు దోమలు విపరీతంగా వ్యాపించి ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మునసబుపేట గ్రామ ప్రజలు చాలా కాలంగా ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే శాశ్వత డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరచాలని కలెక్టర్‌ను కోరినట్లు రావాడ అప్పన్న రాజు తెలిపారు. వినతిపై స్పందించిన జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి డ్రైనేజీ నిర్మాణంతో పాటు గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

## మునగాకు సాగుతో ఆదాయం



**మెళియాపుట్టి, ఆగస్టు 4 (వార్త):** గ్రామాలలో మునగాకు సాగుతో రైతులు ప్రతి ఒక్కరు తమ యొక్క ఆదాయాన్ని మరింతగా పెంపొందించు కోవచ్చునని డిఆర్డిఎ పిడి కిరణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో గల వెలుగు కార్యాలయ ప్రాంగణంలో మునగాకు సాగుపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు అందించే మునగ ఆకు సాగును దేశీయ మార్కెట్లలో మంచి డిమాండ్ ఉందని, మంచి పోషక విలువలు, ఔషధ గుణాలు అధికంగా ఉండటంతో ఈ పంటకు భవిష్యత్తులో మరింత ఆదరణ పెరుగు తుందన్నారు. ఈ పంట ఏడాది పొడవునా ఆదాయాన్ని అందించే అవకాశముందని, నాణ్యమైన మొక్కల ఎంపిక, శాస్త్రీయ సాగు విధానాలు, పంట సంరక్షణ, కోత అనంతర నిర్వహణ, మార్కెటింగ్ అవకాశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. ఆసక్తిగల ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగ పరుచుకొని ప్రయోజనం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో పిడి కిరణ్ కుమార్ తో పాటు ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా, ఏపిఎం త్రినాధమ్మ, డిప్యూటీ ఎంపీడీవో అప్పయ్య, ఏపీఓ రవి, ఉద్యోగులు సిబ్బంది, రైతులు తదితరులున్నారు.

## విద్యార్థులకు కంటి పరీక్షలు




**మందస, ఆగస్టు 4(వార్త):** మందస పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. మందస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందని ప్రిన్సిపల్ బి.తేజేశ్వరరావు చెప్పారు. 250మంది విద్యార్థులకు మందస మండల నేత్ర వైద్యాధికారి రోణంకి వెంకటరమణ కంటి పరీక్షలు నిర్వహించారు. దృష్టి లోపం ఉన్న 21మందికి కంటి అద్దాలకు సిఫార్సు చేశారు. కంటి వ్యాధులు, నేత్ర సంరక్షణ, సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మొబైల్ ఫోన్ వలన కలిగే సమస్యలు వివరించారు. కార్యక్రమానికి ప్రిన్సిపల్ బి.తేజేశ్వరరావు అధ్యక్షతన వహించారు. ఎన్ఎస్ఎస్ పీఓ జి.రమణమూర్తి, లెక్చరర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మన డబ్బులు మన లెక్కలు మహిళా సంఘాలకు అవగాహన

**మందస/వజ్రపుకొత్తూరు, ఆగస్టు 4(వార్త):** మన డబ్బులు మన లెక్కలుపై మహిళా సంఘాలకు అవగాహన కార్యక్రమం సెర్ప్ డీఆర్డీఏ ఏపీఎం గొడబ ప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగింది. వజ్రపుకొత్తూరు మండలంలోని అక్కుపల్లి పంచాయతీలో మన డబ్బులు మన లెక్కలుపై అంబికా వీఓ, శ్రీ కనక దుర్గా వీఓలో గల స్వయం సహాయక సంఘ సభ్యులకు అవగహన, ర్యాలీ చేశారు. సూపర్ ఈ నారీ యాప్ డౌన్ లోడ్ చేసుకొని సంఘాల యొక్క పొదుపులు, అప్పులు సంఘాలోని ప్రతి సభ్యులు తాలూకా ఆర్థిక లావాదేవీల వివరాలను ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చునని తెలిపారు. డ్వాక్రా గ్రూప్ లలో పారదర్శకత పెంపొందించెందుకే రాష్ట్ర ప్రభుత్వం మన డబ్బులు మన లెక్కలు కార్యక్రమం ను ప్రవేశపెట్టిందని వివరించారు ఈ కార్యక్రమం లో ఏపీఎం గొడబ ప్రసాదరావు, వీఓఎలు వరలక్ష్మి, రాజేశ్వరి ఈ నారీలు, డ్వాక్రా లీడర్స్, మహిళలు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని బాతుపురం పంచాయతీలో కూడా ఏపీఎం గొడబ ప్రసాదరావు ఆధ్వర్యంలో మన డబ్బులు మన లెక్కలపై జీవన జ్యోతి స్వయం సహాయక సంఘ సభ్యులకు అవగహన, ర్యాలీ చేయడం జరిగింది. సూపర్ ఈ నారీ యాప్ డౌన్లోడ్ చేసుకొని సంఘాల యొక్క పొదుపులు, అప్పులు సంఘాలోని ప్రతి సభ్యులు తాలూకా ఆర్థిక లావాదేవీల వివరాలను ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చునని ప్రసాదరావు తెలిపారు. డ్వాక్రా గ్రూప్ లలో పారదర్శకత పెంపొందించెందుకే రాష్ట్ర ప్రభుత్వం మన డబ్బులు మన లెక్కలు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం గొడబ ప్రసాదరావు, వీఓఏ స్వాతి, ఈ నారీలు, డ్వాక్రా లీడర్స్, మహిళలు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# నిబంధనలు పాటించని..
# సూర్యతేజ యాజమాన్యం







* సామర్థ్యానికి మించి విద్యార్థులను కళాశాల బస్సుల్లో తరలింపు * పొంచివున్న ప్రమాదం * రవాణా భద్రతపై తల్లిదండ్రుల ఆందోళన * ఆర్టీవో అధికారులు తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

**పలాస, ఆగస్టు 4(వార్త):** పలాస-కాశీబుగ్గలోని సూర్యతేజ జూనియర్ కళాశాల యాజమాన్యం కనీస నిబంధనలు పాటించడం లేదు. కళాశాలకు చెందిన బస్సులో సామర్థ్యానికి మించిన విద్యార్థులను తరలిస్తున్నా ఆర్టీవో, పోలీసు అధికారులకు కనిపించకపోవడం దురదృష్టకరం. బస్సులో సీట్ల సామర్థ్యాన్ని మించి విద్యార్థులు కూర్చోవడంతో పాటు పలువురు నిలబడి ప్రయాణిస్తున్నారు. పాఠశాల, కళాశాల బస్సుల్లో నిర్దేశిత సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించరాదనే నిబంధనలు ఉన్నప్పటికీ, వాటి అమలును పాటించడం లేదు. ఇటీవల కళాశాలకు సంబంధించిన వివాదాల నేపథ్యంలో విద్యార్థుల రవాణా భద్రత అంశం కూడా చర్చనీయాంశంగా మారింది. కళాశాల బస్సుల ఫిట్‌నెస్, ప్రయాణికుల సామర్థ్యం, భద్రతా ప్రమాణాల అమలుపై సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించాలని తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

## సూర్యతేజలో విద్యార్థినుల భద్రతపై జనసేన ఆందోళన

* పోక్సో కేసు నేపథ్యంలో కాలేజీల తనిఖీలకు డిమాండ్
* ఆర్ఐఓ వెంటనే పలాసకు వచ్చి పరిస్థితిని సమీక్షించాలని హరీష్ కుమార్ శ్రీకాంత్ విజ్ఞప్తి



**పలాస, ఆగస్టు 4 (వార్త):** పలాసలోని సూర్యతేజా ప్రైవేట్ జూనియర్ కళాశాలలో పోక్సో కేసు నమోదైన నేపథ్యంలో విద్యార్థినుల భద్రతపై ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి హరీష్ కుమార్ శ్రీకాంత్ కోరారు. ఇలాంటి ఘటన జరిగినప్పటికీ సంబంధిత అధికారులు సమగ్ర తనిఖీలు చేపట్టకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. జిల్లా రీజినల్ ఇన్‌స్పెక్టింగ్ ఆఫీసర్ (ఆర్ఐఓ) తక్షణమే పలాసకు చేరుకుని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో భద్రతా పరిస్థితులను పరిశీలించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థినులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కళాశాలలో విద్యార్థినుల భద్రత, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, సీసీ కెమెరాల పర్యవేక్షణ, మహిళా భద్రతా కమిటీల పనితీరుపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని కోరారు. పోక్సో వంటి కేసులు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి అన్ని కళాశాలల్లో విద్యార్థినుల భద్రతపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని హరీష్ కుమార్ శ్రీకాంత్ సూచించారు. బాధిత విద్యార్థులకు భరోసా కల్పించే చర్యలు తీసుకోవడంతో పాటు, ఫిర్యాదులు చేసే విద్యార్థులను బెదిరించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై ఆన్లైన్లో ఆర్ఐఓకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

## సూర్యతేజ యాజమాన్య నిర్లక్ష్యంపై యూత్ కాంగ్రెస్ ఆగ్రహం

కళాశాల గుర్తింపు రద్దు చేయాలి - యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలి - జిల్లా యూత్ కాంగ్రెస్ నేత డాక్టర్ పూడి కిరణ్ కుమార్



పలాస-కాశీబుగ్గలోని సూర్యతేజ ప్రైవేట్ కళాశాలలో కంప్యూటర్ ఆపరేటర్ ఓ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనను శ్రీకాకుళం జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు డా. పూడి కిరణ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. విద్యార్థినుల భద్రతను విస్మరించి, ఘటనను కప్పిపుచ్చే ప్రయత్నం చేశారంటూ కళాశాల యాజమాన్యంపై ఆయన మండిపడ్డారు.మంగళవారం పలాసలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాధిత విద్యార్థిని కుటుంబానికి సూర్యతేజ కళాశాల యాజమాన్యం వెంటనే రూ.20 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థినుల భద్రతను నిర్ధారించడంలో విఫలమైన సూర్యతేజ కళాశాల గుర్తింపును విద్యాశాఖ తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న నిందితుడిపై ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ పూర్తి చేసి, త్వరితగతిన కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత విద్యార్థినికి సంపూర్ణ న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో తమ పోరాటం కొనసాగుతుందని డా. పూడి కిరణ్ కుమార్ స్పష్టం చేశారు.



## వ్యాధిగ్రస్థులకు వరం సీఎంఆర్ఎఫ్

**కంచిలి, ఆగస్టు 4 (వార్త):** అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుంటున్న అనేకమంది బాధితులకు సీఎం సహాయనిధి వరంగా మారిందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ అశోక్ పేర్కొన్నారు. తన క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ ఎఫ్ ద్వారా మంగళవారం కంచిలి మండలానికి చెందిన పలువురు బాధితులకు 3,39,822 రూపాయలు చెక్కుల రూపంలో అందజేశారు. నరసన్న ముకుందపురం కు చెందిన మునకాల మోహిత్ కు 1,28,503 రూపాయలు, మకరంపురం కు చెందిన సాలిన జానకిరావుకు 97,524, బూరగాం కు చెందిన ధూపాన మాధవరావుకు 65 వేల రూపాయలు, పురుషోత్తపురం కు చెందిన పైల హరికృష్ణకు 48,795 రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు మాదిన రామారావు పాల్గొన్నారు.

## స్వచ్ఛభారత్ మిషన్‌పై రెండ్రోజుల శిక్షణ



**సారవకోట, ఆగస్టు 4 (వార్త):** గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం, తాగునీటి నిర్వహణను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో స్వచ్ఛభారత్ మిషన్‌పై రెండ్రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సారవకోట మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) మురళీమోహన్ కుమార్ తెలిపారు. మంగళవారం సారవకోట మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పరిశుభ్రమైన వాతావరణం నెలకొల్పడంతో పాటు ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. స్వచ్ఛభారత్ మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా పారిశుధ్య నిర్వహణ, ఘన వ్యర్థాల నిర్వహణ, తాగునీటి వనరుల పరిరక్షణ, ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించడం వంటి అంశాలపై అధికారులకు శిక్షణ అందించినట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

## తల్లి పాలు శిశువుకు తొలి రక్షణ




**సారవకోట, ఆగస్టు 4(వార్త):** సారవకోట మండలం చిన్నగుజ్జువాడ సచివాలయంలో మంగళవారం తల్లి పాల వారోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ గర్భిణులు, బాలింతలకు పలు సూచనలు చేశారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ సుజాత మాట్లాడుతూ, నవజాత శిశువులకు పుట్టిన వెంటనే ముర్రుపాలు తప్పనిసరిగా పట్టించాలని సూచించారు. ముర్రుపాలలో శిశువుకు అవసరమైన పోషకాలు సమృద్ధిగా ఉండటంతో పాటు వ్యాధి నిరోధక శక్తిని పెంచే గుణాలు ఉంటాయని తెలిపారు. తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే అందించడం వల్ల శిశువుల ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల శిశువులకే కాకుండా తల్లుల ఆరోగ్యానికీ ఎంతో మేలు జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. క్రమం తప్పకుండా బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం తగ్గుతుందని చెప్పారు. తల్లిపాల ప్రాధాన్యతను ప్రతి కుటుంబం గుర్తించి, శిశువులకు జననం నుంచి తల్లిపాలు అందించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

**పోలాకి, ఆగస్టు 4 (వార్త):** ఖరీఫ్ సీజన్‌లో చేపడుతున్న వరి సాగులో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను అనుసరించి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు నిర్వహించాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు (ఏడీ) ఎల్. వెంకట మధు, వ్యవసాయ అధికారి (ఏవో) కె. చిరంజీవి రైతులకు సూచించారు. మంగళవారం పోలాకి మండలం ఈదులవలస రైతు సేవా కేంద్రంలో ఆత్మఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం కారణంగా సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. పంట అవసరాలకు అనుగుణంగా ఎరువులను సమతుల్యంగా వినియోగించాలని, అధిక మోతాదులో ఎరువులు వాడడం వల్ల దిగుబడిపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. మట్టి పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం చేపడితే వ్యయభారం తగ్గడంతో పాటు మెరుగైన దిగుబడులు సాధించవచ్చని వివరించారు. వరి సాగులో నీటి నిర్వహణ, కలుపు నివారణ, పురుగు--తెగుళ్ల నివారణ చర్యలపై కూడా రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రీయ సాగు విధానాలను పాటించడం ద్వారా దిగుబడులు పెంచుకోవడంతో పాటు సాగు వ్యయాన్ని కూడా తగ్గించుకోవచ్చని అధికారులు సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో రైతులు పాల్గొని పంట సాగుకు సంబంధించిన పలు సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు.



## మడపాంలో భారీ చోరీ

* 55 తులాల బంగారం అపహరణ * పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

**నరసన్నపేట, ఆగస్టు 4 (వార్త):** నరసన్నపేట మండలంలోని మడపాం గ్రామంలో భారీ చోరీ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గుర్తు తెలియని దుండగులు సుమారు 55 తులాల బంగారాన్ని అపహరించినట్లు బాధితుడు జామి నర్సింగ్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. తన భార్య అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉండటంతో కుటుంబ సభ్యులతో కలిసి అక్కడే ఉన్నామని, అనంతరం ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ జరిగినట్లు గుర్తించామని తెలిపారు. ఇంట్లో భద్రపరిచి ఉంచిన సుమారు 55 తులాల బంగారాన్ని గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఘటనపై వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, వారు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది. చోరీకి పాల్పడిన నిందితులను గుర్తించేందుకు పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నారు. ఏళ్ల తరబడి కష్టపడి కూడబెట్టుకున్న బంగారం చోరీకి గురికావడంతో తీవ్ర ఆవేదనకు గురయ్యానని బాధితుడు జామి నర్సింగ్‌రావు వాపోయారు. నిందితులను త్వరగా గుర్తించి తమ ఆస్తిని తిరిగి అప్పగించాలని ఆయన పోలీసులను కోరారు.

## చెన్నయ్యవలస పాఠశాల పరిశీలన



**జలుమూరు, ఆగస్టు 4(వార్త):** జలుమూరు మండలం చెన్నయ్యవలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారులు బమ్మిడి మాధవరావు, ఎంవీఆర్ఎస్ ప్రసాదరావు మంగళవారం సందర్శించి పాఠశాల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదులను సందర్శించిన అధికారులు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న యూనిఫార్మ్‌ల పంపిణీపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసిన ఎంఈఓలు, విద్యా ప్రమాణాల మెరుగుదల, విద్యార్థుల అభ్యసన నైపుణ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయుడు రాజారావుకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ విద్యను మరింత నాణ్యంగా అందించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని వారు సూచించారు.

## పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన



**జలుమూరు, ఆగస్టు 4(వార్త):** ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్య అలవాట్లపై అవగాహన పెంపొందించడం ఎంతో అవసరమని ఎంహెచ్‌పీ గాయత్రి అన్నారు. మంగళవారం జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో రాణ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల అనేక అంటువ్యాధులకు దూరంగా ఉండవచ్చని తెలిపారు. భోజనం చేసే ముందు తప్పనిసరిగా సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని విద్యార్థులకు సూచించారు. జ్వరం, దగ్గు లేదా ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఉపాధ్యాయులకు లేదా వైద్య సిబ్బందికి తెలియజేయాలని చెప్పారు. విద్యార్థులు పరిశుభ్రతను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకుంటే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని గాయత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అత్తింటి వేధింపులపై ఫిర్యాదు



**మెళియాపుట్టి, ఆగస్టు 4 (వార్త):** మెళియాపుట్టి మండలం చాపర గ్రామానికి చెందిన తమరి మాధవి మహిళ తనను అత్తింటి వారు ప్రతి రోజు హింసిస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె భర్త ధారపు ధనుంజయరావు, సంబంధిత కుటుంబ సభ్యులపై వరకట్న వేధింపులు, గృహహింస కేసు నమోదు చేసినట్లు మెళియాపుట్టి పోలీసులు తెలిపారు. బాధితురాలు మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు 2010లో తమకు వివాహం కాగా ఇద్దరు కుమారులున్నారన్నారు. భర్త ఆర్మీలో పనిచేసి పదవీ విరమణ పొందిన అనంతరం కుటుంబంలో విభేదాలు మరింత తీవ్రమయ్యాయన్నారు. అత్తింటివారు తనను అవమానిస్తూ ఇంటి పనులన్నీ చేయించేవారని, కుటుంబ సభ్యులు కలిసి మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని, ఇటీవల కాలంలో విడాకులు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారని దీనికి నేను నిరాకరించడంతో భర్త తనపై దాడి చేసి గాయపరిచినట్లు బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. జరిగిన ఘటనపై ఫిర్యాదు చేయగా హెడ్ కానిస్టేబుల్ డిలేశ్వరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చేనేత సమ్మేళనం విజయవంతం చేయండి

**శ్రీకాకుళం, ఆగస్టు 4 (వార్త):** విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం నిర్వహించనున్న చేనేత సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా సీనియర్ నాయకులు పసుపులేటి సురేష్ తెలిపారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, దేవాంగుల సాధికార సమితి డైరెక్టర్, శ్రీకాకుళ పట్టణ దేవాంగ సంక్షేమ సంఘ ఉపాధ్యక్షులు గుత్తుచిన్నారావుతో కలిసి శ్రీకాకుళం పట్టణం బదూర్ పేటలో లో ఉన్న శ్రీ సర్వేశ్వర చేనేత సహకార సంఘం సభ్యులను, పట్టణంలో ఉన్న చేనేత సంఘాల కుల పెద్దలు, సంఘ నాయకులతో కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పసుపులేటి సురేష్ మాట్లాడుతూ, భారతీయ సంస్కృతికి ప్రత్యేకంగా నిలిచిన చేనేత మరియు ఖాదీ పరిరక్షణ చేనేత కార్మికుల సంక్షేమం, స్వదేశీ ఉత్పత్తుల ప్రోత్సాహం లక్ష్యంగా చేనేత సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు.

## గ్రూప్-2 ఉచిత శిక్షణకు 100 మంది అభ్యర్థుల ఎంపిక

**శ్రీకాకుళం, ఆగస్టు 4 (వార్త):** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షలకు హాజరయ్యే జిల్లా అభ్యర్థులు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ డైరెక్టర్ ఇ.అనురాధ పిలుపునిచ్చారు. మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఈ నెల 6వ తేదీ నుండి శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, డిగ్రీ మార్కుల మెరిట్, కుల రిజర్వేషన్ల ప్రాతిపదికన మొత్తం 100 మంది అభ్యర్థులను ఎంపిక చేసినట్లు స్పష్టం చేశారు. ఇందులో బీసీ కేటగిరీకి 66, ఎస్సీలకు 20, ఎస్టీలకు 14 చొప్పున స్థానాలు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులందరూ నిర్ణీత సమయానికి వేదిక వద్దకు చేరుకుని తరగతులకు హాజరుకావాలని సూచించారు.

## అమరజీవి కృష్ణారావు సేవలు స్మరణీయం

**శ్రీకాకుళం, ఆగస్టు 4 (వార్త):** తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణకు, సమాజ సేవకు మండలి వెంకట కృష్ణారావు చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా పర్యాటక శాఖ, యువజన సర్వీసుల శాఖ (సెట్ శ్రీ) సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ మండలి వెంకట కృష్ణారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ముఖ్య అతిథిగా హాజరై కృష్ణారావు చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ వికాసానికి, పాలనలో ప్రజాహిత నిర్ణయాలకు కృష్ణారావు చూపిన బాట అనుసరణీయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సెట్ శ్రీ ముఖ్య కార్యనిర్వహణాధికారి వి.వెంకటప్పలనాయుడు, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావుతో పాటు పర్యాటక శాఖ, సెట్ శ్రీ, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొని నివాళులర్పించారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546